## గచ్చిబౌలి పబ్‌లో తనిఖీలు

### నలుగురికి డ్రగ్ పాజిటివ్

శేరిలింగంపల్లి, జూన్ 14: గచ్చిబౌలి పబ్‌లో తనిఖీ చేయగా నలుగురికి డ్రగ్ పాజిటివ్ రావడంతో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. వారాంతం కావడంతో శుక్రవారం రాత్రి గచ్చిబౌలి ఎస్ఎల్ఎన్ టెర్మినస్ లోని ఫ్రాట్ హౌస్, క్లబ్ రోగ్ పబ్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పబ్‌కు వచ్చిన వారిని యూరిన్ టెస్ట్ చేయగా ఫ్రాట్‌హౌస్ పబ్‌లో ముగ్గురు యువకులకు, రోగోపబ్‌లో ఒక యువకుడికి డ్రగ్ పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి సేవించి పబ్‌కు వచ్చినట్లు నిర్ధారణ కావడంతో వారిపై కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## గృహకార్మికులకు సమగ్ర చట్టం అమలు చేయాలి

రవీంద్రభారతి,జూన్14: పట్టణాల్లో పనిచేస్తున్న గృహ కార్మికుల కోసం సమగ్ర చట్టం ఆమోదించి అమలు చేయాలని నేషనల్ ప్లాట్‌ఫారం ఆఫ్ డోమెస్టిక్ వర్కర్స్(ఎన్‌పీడీడబ్ల్యూ)డిమాండ్ చేసింది. 16 న అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం సందర్భంగా శనివారం దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎన్‌పీడీడబ్ల్యూ అధ్యక్షుడు అన్న జోసఫ్, కన్వీనర్ లిస్సీ జోసఫ్, జీయూటీఎస్ అధ్యక్షురాలు మంజుల మాట్లాడుతూ గృహ కార్మికుల కోసం సమగ్ర చట్టం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.గృహకార్మికులను దోపిడీకి గురిచేస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. గృహకార్మికులకు జాతీయ స్థాయి చట్టం లేకపోవడం వల్లనే దోపిడీ కొనసాగుతూ గృహకార్మికులకు సరైన న్యాయం జరగడంలేదన్నారు.2025 జనవరి 29న సుప్రీం కోర్టు డివిజన్ బెంచ్, జస్టిస్ సూర్యకాంత్ , జస్టిస్ భూయాన్‌లతో కూడిన బెంచ్ గృహకార్మికులు ఎదుర్కొంటున్న కఠినమైన , దోపిడీ స్వభావ యదార్థాలను హైలెట్ చేసి క్రిమినల్ నంబర్ 8777122కు సంబంధించిన తీర్పును వెలువరించిందని, ఫలితంగా కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆరు నెలల్లోగా చట్టాన్ని చేయాలని ఆదేశించిందన్నారు. జాతీయ స్థాయి చట్టం లేకపోవడం వల్లనే కార్మికులపై దోపిడీ కొనసాగుతుందన్నారు. తక్షణమే సుప్రీం కోర్టు ఆదేశాన్ని వేగవంతం చేసి అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో 11లక్షలకు పైగా గృహకార్మికులు ఉన్నారని, వారిని గుర్తించి కార్మికుల ట్రేడ్ యూనియన్లు , యన్‌పీడీ డ బ్ల్యూ, గృహకార్మికుల రక్షణ, నియంత్రణ బిల్లును రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపట్టి ఆమోదింపజేయాలన్నారు.గృహ మహిళా కార్మికులు లైగింకంగా, శారీరక,భావోద్వేగ దుర్వినియోగాన్ని గురవుతున్నారని తెలిపారు. వెంటనే గృహకార్మికుల చట్టాన్ని అమలు చేయాలన్నారు.

# శివారులో గ'మత్తు' లోకం

## అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఫామ్‌హౌస్, రిసార్ట్స్‌లు

- డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాల వినియోగం
- ధనార్జనే ధ్యేయంగా అనుమతులు లేకున్నా అద్దెకు
- పోలీసులకు ముడుపులు ఇస్తున్న యజమానులు
- ఇష్టానుసారంగా ఈవెంట్లు



సిటీబ్యూరో, జూన్ 14 (నమస్తే తెలంగాణ): సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్స్‌లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. గతంలో రేవ్ పార్టీలకు స్థావరంగా ఉన్న ఆయా ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్స్‌లలో నేటికి గుట్టుచప్పుడు కాకుండా అన్నిరకాల ఈవెంట్లు జరుగుతున్నాయి. ముఖ్యంగా వీటిల్లో డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు నిర్వాహకులు ధనార్జనే ధ్యేయంగా ఎలాంటి అనుమతులు లేకున్నా ఈవెంట్లకు ఫామ్‌హౌస్, రిసార్ట్స్‌లను అద్దెకు ఇస్తున్నారు. ఆబ్కారీ శాఖ అనుమతి లేనిదే మద్యం వినియోగం ఉండే ఈవెంట్‌కు అంగీకరించకూడదు. పోలీసు శాఖ అనుమతి లేనిదే డీజేకు అనుమతించకూడదు. ప్రస్తుత పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి.

**మంగ్లీ ఘటనతో ..**

మంగ్లీ ఘటనతో రిసార్ట్స్, ఫామ్‌హౌస్ నిర్వాహకుల కక్కుర్తి బయటపడింది. ఈ ఘటనలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అనుమతి లేకుండా మద్యం వినియోగానికి సదరు రిసార్ట్స్ నిర్వాహకులు అనుమతివ్వడం గమనార్హం. వాస్తవానికి ఏదైనా ఈవెంట్‌కు రిసార్ట్స్ లేదా ఫామ్‌హౌస్‌లను అద్దెకి ఇచ్చే సమయంలో ఈవెంట్‌కు సంబంధించిన పూర్తి వివరాలను యాజమాన్యం తెలుసుకోవాలి. ఈవెంట్‌లో మద్యం వినియోగం, డీజే, వంటివి వినియోగిస్తున్నారా లేదా అనే విషయాలను స్పష్టంగా తెలుసుకోవాలి. ఒకవేల మద్యం, డీజే వంటివి వినియోగిస్తే తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుంచి అనుమతి పత్రాన్ని కోరాలి. పోలీసు, ఆబ్కారీ శాఖల అనుమతి ఉంటేనే మద్యం వినియోగానికి, డీజే తదితరాల వినియోగానికి అంగీకరించాలి. నిర్వాహకులు ధనార్జనే ధ్యేయంగా ఎలాంటి అనుమతులు లేకున్నా ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్స్‌లను ఇష్టానుసారంగా అద్దెకు ఇస్తున్నారు.

**దొరికితే దొంగలు..!**

సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో సుమారు 100కి పైగా ఫామ్‌హౌస్‌లు, 50కి పైగా రిసార్ట్స్‌లు ఉన్నాయి. వీటిల్లో ప్రతి రోజు ఎక్కడో కొన్ని చోట్ల రకరకాల ఈవెంట్లు లేదా పార్టీలు జరుగుతుంటాయి. ఒక వారాంతరాల్లో అయితే దాదాపు అన్ని ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్స్ హౌస్‌ఫుల్‌గా ఉంటాయి. అయితే ఎక్కడా ఎలాంటి పార్టీలు, ఈవెంట్లు జరుగుతున్నాయో సరైన స్పష్టత ఉండటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంత మంది నిర్వాహకులు స్థానిక పోలీసులకు నెలవారి ముడుపులు చెల్లిస్తుండటంతో వారు కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక ఏదైనా రాజకీయ కోణంలో వచ్చే ఫిర్యాదులు లేక పై స్థాయిలో వచ్చే ఫిర్యాదులతో మాత్రమే పోలీసులు హడావిడి చేస్తున్నారనే విమర్శలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో జరిపే దాడుల్లో నిబంధనలకు విరుద్ధంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారు దొరికితే దొంగలుగా, దొరక్కపోతే దొరల్లా మిగిలిపోతున్నారనే వాదలు వినిపిస్తున్నాయి.

**ముడుపుల కోసం వేధింపులు..**

పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ముడుపుల కోసం వేధిస్తున్నారని పలువురు ఫామ్‌హౌస్, రిసార్ట్స్‌ల నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. ఈవెంట్లు జరిగినా, జరగకపోయినా వారికి మాత్రం నెలవారి ముడుపులు చెల్లించుకోవాల్సిందే అని లేకపోతే చట్టాల పేరుతో రకరకాలుగా వేధిస్తారని కొందరు నిర్వాహకులు వాపోతున్నారు. ముడుపులు చెల్లించిన వారికి ఎలాంటి నిబంధనలు ఉండవని ఆయా ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్స్‌లలో అన్ని రకాల ఈవెంట్లు యథేచ్ఛగా సాగుతున్నట్లు కొందరు నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. అయితే తమ ఫామ్‌హౌస్, రిసార్ట్స్‌ల నిర్వహణ ఖర్చులతో పాటు ఆయా అధికారులు ముడుపుల ఖర్చు కోసం తాము ఎలాంటి అనుమతులు లేకున్నా ఈవెంట్ల నిర్వహణకు అంగీకరిస్తున్నట్లు పలువురు నిర్వాహకులు చెబుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**మేడ్చల్, జూన్ 14:** రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాసరేగడిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... శుక్రవారం అర్ధరాత్రి తర్వాత గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ బాసరేగడి పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన హెచ్‌పీ పెట్రో బంక్ ముందు గుర్తు తెలియని వ్యక్తి(30) నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది.ఈ ఘటనలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు 108లో గాంధీకి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆచూకీ తెల్సిన వారిని మేడ్చల్ పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని పోలీసులు కోరారు

## కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత



విజయ్ భార్యకు నగదు అందజేస్తున్న డీసీపీ రాజేశ్, తదితరులు

శంషాబాద్ రూరల్, జూన్ 14 : శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తూ గత నెలలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ విజయ్ కుటుంబానికి శంషాబాద్‌జోన్ పోలీసులు, సిబ్బంది శనివారం శంషాబాద్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ రాజేశ్ ఆధ్వర్యంలో విజయ్ భార్యకు రూ.15 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీ రాజేశ్ మాట్లాడుతూ కొంతకాలం నుంచి శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న విజయ్ గత నెల 24 వ తేదీన రాత్రి సమయంలో విధులు నిర్వహిస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అతడికి తోటి పోలీసులుగా అందరం కలిసి ఆర్థిక సహాయం అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ అడిషనల్ డీసీపీ పూర్ణ చంద్ర,శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ,శంషాబాద్ సీఐ నరేందర్‌రెడ్డి,ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు, ఆర్‌జీఐఏ ట్రాఫిక్ సీఐ ప్రమోద్ తదితరులు ఉన్నారు.

## కుటుంబ కలహాలతో గృహిణి ఆత్మహత్య

అమీర్‌పేట్, జూన్ 14 : కుటుంబ కలహాలతో గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పశ్చిమగోదావరి జిల్లా తిమ్మాపురం గ్రామానికి చెందిన రాజు, శ్రావణి (30) దంపతులు కొద్దికాలం క్రితం ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చి ఎర్రగడ్డలోని జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లో హౌస్ మెయిడ్స్‌గా పని చేస్తున్నారు. దంపతులు ఇదే అపార్ట్‌మెంట్స్‌లో తమ తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఈ మధ్యకాలంలో కుటుంబంలో గొడవలు జరగడంతో మానసిక ఒత్తిడికి గురైన శ్రావణి శనివారం ఉదయం అపార్ట్‌మెంట్స్‌లోని 5వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. సనత్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బైక్ దొంగ అరెస్ట్, రిమాండ్

బొల్లారం,జూన్ 14 : పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను దొంగతనాలకు పాల్పడుతున్న ఓ యువకుడిని శనివారం తిరుమలగిరి పోలీసుల అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి ఎయిర్ లైన్స్ కాలనీలో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గత నెల 29 న ముషీరాబాద్ భోలక్ పూర్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ ముబాషీర్ హుస్సేన్ దొంగిలించాడు. వాహనదారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. 50 సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడిని శనివారం అరెస్ట్ చేశారు. మూడు కమిషనరేట్ల పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో నిందితుడు పై 6 కేసులు ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. నిందితుడిని రిమాండ్ కు తరలించారు.

## ప్యారడైజ్ ఫ్లైఓవర్ వద్ద రెండు కార్లు ఢీ..

### డ్రైవర్లకు గాయాలు

బేగంపేట్ జూన్ 14.. సికింద్రాబాద్ ప్యారడైజ్ ఫ్లైఓవర్ పైకి వేగంగా దూసుకెళ్లిన కారు పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీ కొట్టిన ఘటన బేగంపేట పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న మరొక కారు డివైడర్ ను ఢీ కొట్టి ఆగిన కారును ఢీ కొట్టింది.కార్లలో ప్రయాణిస్తున్న డ్రైవర్లకు గాయాలయ్యాయి. ఫ్లైఓవర్ పైకి వెళ్లే క్రమంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వేగంగా దూసుకొచ్చిన ఇన్నోవా కారు డివైడర్ ను ఢీకొట్టడంతో కారు చక్రాలు ఊడిపోయాయి. వెనకే వచ్చిన స్విఫ్ట్ కారు ఇన్నోవా కారును ఢీకొట్టడంతో ఫ్లై ఓవర్ పైకి వెళ్లే మార్గం మూసుకుపోయింది. ఈ క్రమంలో ఫ్లైఓవర్ పైకి వెళ్లేందుకు దారి లేక భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు రెండు కార్లను అక్కడి నుంచి తరలించారు. బేగంపేట ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను కంట్రోల్ చేశారు దీంతో రెండు గంటల పాటు ప్యాట్నీ ప్యారడైజ్ బేగంపేట గ్రీన్ ల్యాండ్స్ వరకు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

కొండాపూర్, జూన్ 14:వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురి నృత్యకారుల ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కూచిపూడి నాట్య గురువులు మద్దాలి ఉష గాయత్రీ శిష్య బృందం 'కూచిపూడి విభావరి'తో ప్రత్యేకంగా అలరించారు. వాతాపి గణపతి, స్వామినాథ, శివ దీక్ష, ప్రహ్లాద పట్టాభిషేకం, బాల కనకమయ, చక్కని తల్లికి, శ్రీ కృష్ణ జనన శబ్దం, అలరులు కురియగా, గొల్లకలాపం, తిల్లాన అంశాలను వాసవి చౌదరి, ఆశ్రిత షిండే, యశస్వినీ శ్రీ, శ్రద్ధ వారణాసి, సహస్ర, చేరిష్య ప్రదర్శించిన తీరు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది.



నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

## ముగ్ధ మనోహరంగా నృత్యార్చన



నృత్య ప్రదర్శనలతో అలరిస్తున్న కళాకారులు

మాదాపూర్, జూన్ 14: కళాకారుల నృత్య ప్రదర్శన చేసి భక్తులను విశేషంగా అలరించారు. మాదాపూర్‌లోని అన్నమాచార్య భవన వాహిని వ్యవస్థాపకురాలు, పద్మశ్రీ, డా. శోభరాజు ఆధ్వర్యంలో విద్యార్థులతో శ్రీవరసిద్ధి వెంకటేశ్వరస్వామి వారి నృత్యం నిర్వహించారు. తొలుత విష్ణు సహస్రనామ స్తోత్రము, లక్ష్మీఅష్టోత్తర శతనామ స్తోత్రం, అన్నమయ్య అష్టోత్తరం, గురు స్తుతి చేయగ శ్రీభాస్కర డ్యాన్స్ అకాడమీ సంస్థ గురువు డి.సాత్విక శిష్య బృందం హోష్నవి, శ్రీశ్విత, హర్షిత, లక్ష్మి ప్రనతి, మనస్వి, వైష్ణవి, శ్రీహిత, బాల భవ్య శ్రీ, సహస్ర, ధరనిత, ప్రజ్ఞ, హాసిని, చైత్ర, చైత్రిక సంయుక్తంగా కుంభ హారతి, అలరింపు, గణపతి తాళం, ముద్దుగారె యశోద, శివ కైవరం, తెలుగు భాష విజయం, అల్ల అల్ల వాడు హరి ఏమో (నవ జనార్దన పారిజాతం), చిదంబర స్తోత్రం వంటి సంకీర్తనలకు నృత్య ప్రదర్శనలు చేసి కనువిందు చేశారు. తదనంతరం కళాకారులను సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డా. నందకుమార్ జ్ఞాపిక అందించి అభినందించారు.





## విమాన ప్రమాద మృతులకు నివాళి

కవాడిగూడ, జూన్ 14: అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదంలో ప్రయాణికు లు తమ విలువైన ప్రాణాలను కోల్పోవడం ఎయిర్ ఇండియా తప్పిదమేనని, దీనికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు అ న్నారు. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మృతిచెందిన ప్రయాణికుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో శనివారం సాయం త్రం ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్య క్తం చేశారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు విజయ్, బుర్ర రాములుగౌడ్, డాక్టర్ అన్సారీ, అఫ్స స లాం, డాక్టర్ సోలోమన్‌రాజులు మాట్లాడుతూ.. ప్రభుత్వరంగ సంస్థగా ఉన్న ఎయిర్ ఇండియాను ప్రైవేట్‌పరం చేయడంతో ఎయిర్ ఇండియాకు ప్రయాణ చార్జీల పెంపుపై ఉన్న శ్రద్ధ ప్రయాణికుల భద్రతపై లేదని మండిపడ్డారు. ప్రయాణికులు వారికి ముఖ్యం కాదని లాభాలే ముఖ్యమని అన్నారు. విమాన ప్రమాదంలో ప్రయాణికులతో పాటు వైద్య వి ద్యార్థులు అనేక మంది ప్రాణాలు కోల్పోవడం హృదయాలను కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వానికి పరిశ్రమల ప్రైవేటీకరణపై ఉన్న శ్రద్ధ ప్రజలను సురక్షితంగా ఉంచడంలో లేద ని విమర్శించారు. గతంలో కేంద్ర రైల్వే శాఖమంత్రిగా లాల్‌బహదూర్ శాస్త్రి ఉన్నప్పుడు రైలు ప్రమాదం సంభవిస్తే అందు కు బాధ్యత వహిస్తూ రాజీనామా చేసిన నాయన ప్రమాదంపై విచారణ జరిపించి దోషులకు శిక్ష వేయించారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఏ ప్రమాదం జరిగినా మోదీ ప్ర భుత్వం తప్పు వేరే వారిపై రుద్దే ప్రయ త్నం చేస్తుందని ఆరోపించారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు విమాన ప్రమాదానికి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాం డ్ చేశారు. విచారణ జరిపించి దోషులకు కఠినంగా శిక్ష వేయించాలని, భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ నాయకులు రాకేశ్‌సింగ్, లక్ష్యనాయక్, రహమాన్‌షరీఫ్, రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఉత్తమ మార్గం

ఆర్.కె.పురం, జూన్ 13:రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాలలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కర్ణ కుమార్ మాట్లాడుతూ, జాతీయ లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లోక్ అదాలత్‌లో సెటిల్ చేసుకోవడం ద్వారా సివిల్ కేసులలో చెల్లించిన కోర్టు ఫీజు కూడా తిరిగి పొందొచ్చు అని చెప్పారు. ఆస్తి పరమైన కేసులు, కుటుంబ సమస్యల కేసులు పరిష్కారం చేసుకోవడానికి ఈ లోక్ అదాలత్, మధ్యవర్తిత్వం ఒక మంచి వేదిక అని చెప్పారు. లోక్ అదాలత్ లో కేసు రాజీ అవ్వడం ద్వారా ఇరు వర్గాలు గెలిచినట్టే అని అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి. శ్రీవాణి మాట్లాడుతూ, రంగా రెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టు ప్రాంగణాలలో 22 లోక్ అదాలత్ బెంచిలు ఏర్పాటు చేశామని, ఇందులో రాజీకి ఆమోదయోగ్యమైన క్రిమినల్ కేసులు, సివిల్ దావాలు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, కన్జ్యూమర్ కోర్టు కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించుకోవచ్చునన్నారు.



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

## 'సాకేత్'అక్రమాలపై నివాసితుల ధర్నా





గౌరవెల్లి లోని సాకేత్ భూసత్వ గేటు వద్ద ఆందోళ న చేస్తున్న నిర్వాసితులు

మేడ్చల్ రూరల్, జూన్ 14 : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి గౌడవెల్లి శివారులో గల సాకేత్ భూసత్వ బిజినెస్ కార్యాలయం ఎదుట సాకేత్ బిల్డర్ అక్రమాలకు నిరసనగా సాకేత్ భూ సత్వా ఫేస్ -1 నివాసితులు, సాకేత్ ప్రణామం వయోవృద్ధులు సంయుక్తంగా శనివారం ధర్నా చేశారు. సుమారు 200 మంది నివాసితులు నిర్వహించిన ఈ ధర్నా అనంతరం సాకేత్ ప్రణామం ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్ష , కార్యదర్శులు శ్రీరంగారావు, వల్లభేంద్రరెడ్డి మాట్లాడారు. సాకేత్ భూసత్వాలో మాయమాటలు చెప్పి ఫ్లాట్స్, విల్లాలు కొనిపించారని, కొనుగోలు సమయంలో తమకు కల్పిస్తామన్న వసతుల సౌకర్యాలు ఇవ్వలేదని ఆరోపించారు. సాకేత్ బిల్డర్ అసంపూర్తి పనులు చేసి నివాసితులకు అపార్ట్ మెంటులోని రెండు బ్లాక్ లలో ఫ్లాట్లను , ఫేస్-1 లోని విల్లాలను అప్పగించారని తెలిపారు. ఈ విషయంపై గతంలో రెరా కోర్టుకు ఫిర్యాదు చేయగా విచారణ జరిపి 60 రోజుల్లోగా పనులను పూర్తిచేయాలని ఏప్రిల్ 11 న తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. దీంతో బిల్డర్ ఖర్చు లేని చిన్న చిన్న పనులు మాత్రమే చేసి చేతులు దులుపుకున్నారని వారు ఆరోపించారు. తమ వద్ద వసూలు చేసిన నిర్వహణ డబ్బులకు లెక్కలు చెప్పాలని, ఇచ్చిన హామీ మేరకు వాకింగ్ ట్రాక్ , స్విమ్మింగ్ పూల్ నిర్మాణం తదితర పనులు వెంటనే పూర్తిచేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం భూ సత్వా విల్లాల వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు , ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ తమకు మంచినీటి సౌకర్యం, భద్రత లాంటి కనీస సదుపాయాలు కూడా కల్పించలేదని, మున్సిపల్ నీటి సౌకర్యం కోసం రూ. 75 వేల నుంచి రూ. లక్ష వరకు వసూలు చేసి కలుషిత నీటిని ఇస్తున్నారని ఆరోపించారు. విల్లాలు , అపార్ట్ మెంట్స్ మెయింటెనెన్స్ అధ్వానంగా ఉంటున్నాయని, నెలనెలా వసూలు చేసిన డబ్బులకు లెక్కలు అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారన్నారు. వాడిన మురుగు నీటిని శుద్ధి చేయకుండా వదిలివేస్తున్నారని ఆరోపించారు. శాశ్వత కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టాలని, తమపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులు రామకృష్ణరాజు , సురేఖ రాజు కుమార్ , అరుణాచలం, సవిత , ఉష తదితరులు పాల్గొన్నారు.

## ఫోర్జరీ పత్రాలతో జీహెచ్‌ఎంసీ స్థలం ఆక్రమణ

### విక్రయించేందుకు యత్నం .. నిందితుడిపై కేసు

బంజారాహిల్స్,జూన్ 14: జూబ్లీహిల్స్‌లో ఖరీదైన జీహెచ్‌ఎంసీ స్థలాన్ని ఫోర్జరీ పత్రాలతో అమ్ముకునేందుకు యత్నించిన వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే..జూబ్లీహిల్స్ రోడ్ నం 1లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్ పక్కన జూబ్లీహిల్స్ సొసైటీకి చెందిన క్లినిక్ స్థలం ఉంది. ఈ స్థలం పక్కనే ఉన్న 2వేల గజాల జీహెచ్‌ఎంసీ ఓపెన్ స్థలంలో సుమారు 15ఏళ్లుగా సత్యనారాయణ అనే వ్యక్తి తిష్ఠవేసి నర్సరీ ఏర్పాటు చేశాడు. సొసైటీ లే అవుట్‌లో జీహెచ్‌ఎంసీ ఓపెన్ స్పేస్‌గా ఉన్న 2వేల గజాల స్థలాన్ని తమకు 1976లోనే జూబ్లీహిల్స్ సొసైటీ కేటాయించిందంటూ నమ్మించారు. కాగా ఈ వ్యవహారంపై జీహెచ్‌ఎంసీకి ఫోర్జరీ పత్రాలను సమర్పించడంతో పాటు ఆస్తిపన్ను చెల్లించినట్లు పత్రాలు సృష్టించినట్లు తేలింది. సొసైటీకి చెందిన క్లినిక్ స్థలాన్ని అనుకుని ఉన్న జీహెచ్‌ఎంసీ స్థలాన్ని బోగస్ పత్రాలతో ఆక్రమించిన వ్యవహారంపై జూబ్లీహిల్స్ సొసైటీ సభ్యులు రెండేళ్ల క్రితం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదులు చేశారు. అయితే జీహెచ్‌ఎంసీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇదిలా ఉండగా ఇటీవల స్థలాన్ని తనదిగా చూపిస్తూ వేరొకరికి అమ్మేందుకు సత్యనారాయణ ప్రయత్నిస్తున్నట్లు గుర్తించిన సొసైటీ అధ్యక్షుడు రవీంద్రనాథ్ శుక్రవారం రాత్రి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.80కోట్ల విలువైన జీహెచ్‌ఎంసీ ఓపెన్ స్థలాన్ని ఆక్రమించడంతో పాటు ఫోర్జరీ పత్రాలతో వేరొకరికి అమ్మేందుకు యత్నిస్తున్న సత్యనారాయణ మీద చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. సత్యనారాయణ మీద కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఫిట్‌నెస్ లేని బస్సులపై కొరడా



నోటీసులు జారీ చేస్తున్న అధికారులు

సిటీబ్యూరో, జూన్ 14 ( నమస్తే తెలంగాణ ) : ఫిట్‌నెస్‌లేని బస్సులు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న విద్యాసంస్థల బస్సులపై ఆర్టీఏ కొరడా ఝుళిపిస్తున్నది. ఆర్టీఏ ప్రత్యేక డ్రైవ్‌లో 67 బస్సులపై కేసు నమోదు చేసింది. విద్యాసంవత్సరం ప్రారభమైనప్పటికీ వేల సంఖ్యలో ప్రైవేటు పాఠశాలలు బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలకు దూరంగా ఉన్నాయి. సామర్థ్యం పరీక్షలు చేయించకుండానే బస్సులను రోడ్లపై తిప్పుతున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందునుంచే అధికారులు నోటీసుల జారీ చేస్తున్నా.. విద్యా సంస్థలు వాటిని తేలిగ్గానే తీసుకుంటున్నాయి. నిర్వాహుకులు పిట్‌నెస్ పరీక్షలకు ఎగనామం పెడుతున్నారు. పాఠశాలల ప్రారంభ రోజుల్లో ఆర్టీఏ తనిఖీలు సాధారణమేనని.. కొన్ని రోజులు గడిస్తే ఈ విషయాన్ని తేలిగ్గా తీసుకుంటారని ప్రైవేట్ విద్యాసంస్థలు బాహటంగానే పేర్కొంటున్నాయి. స్కూల్ బస్సులకు స్పీడ్ గవర్నెన్స్ బిగించాలని, ఫిట్‌నెస్ పరీక్షలన్నీ పూర్తి చేయాలని రవాణా శాఖ గతంలోనే ఆదేశాలు ఇచ్చింది. ఈ ఆదేశాలను చాలా విద్యాసంస్థలు పాటించలేదు. గతంలో ఫిట్‌నెస్ లేని బస్సులు ప్రమాదాలకు గురైన సంఘటనల నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందుగానే చర్యలు తీసుకో వాలనుకుంటున్నారు. గ్రేటర్‌లో విద్యాసంస్థలు బస్సులు 13,500 ఉన్నాయి. ఇందులో 3071 బస్సులు ఫిట్‌నెస్ చేయించుకోలేదు. వీటిపై ఆర్టీఏ ప్రత్యేక డ్రైవ్ చేపట్టి కేసులు నమోదు చేస్తున్నది.

## లోక్ అదాలత్‌లో హైదరాబాద్ జిల్లా ఫస్ట్

### 3,65,293 కేసుల పరిష్కారం

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జూన్ 14 (నమస్తే తెలంగాణ): జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా హైదరాబాద్ జిల్లా మరోసారి 3,65,293 కేసులు పరిష్కరించి ప్రథమస్థానంలో నిలిచి సంచలనం సృష్టించింది. వరుసగా నాలుగోసారి జాతీయ లోక్ అదాలత్‌లో రాష్ట్రంలోనే హైదరాబాద్ జిల్లా ఫస్ట్‌గా నిలిచింది. హన్మకొండ తొమ్మిది, గద్వాల్ జోగులాంబ 11వ స్థానంతో సరిపెట్టుకుంది. హైదరాబాద్ జిల్లా కింద రైల్వేకోర్టు, ఇంటిగ్రేటెడ్ కోర్టు, మనోరంజన్, నాంపల్లి, సికింద్రాబాద్‌కోర్టులకు చెందిన బెంచ్‌లు అధిక కేసులను పరిష్కరించి ఉత్తమ ఫలితాల్ని అందించాయి. కిమినల్ కేసులు 2,31,370, సివిల్ 692, ప్రీ లిటిగేషన్ 1,33,231కేసులు పరిష్కరించారు. ఆమోదయోగ్యమైన క్రిమినల్, ట్రాఫిక్ చలాన్, చెక్ బౌన్స్, విద్యుత్ చోరీ కేసులు, ఎక్సైజ్, ఈ-పెట్టి కేసులను పరిష్కరించి కేసులను తొలగించడం జరిగింది. హైదరాబాద్ జిల్లాను మరోసారి మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేసిన మెజిస్ట్రేట్లు, పీపీలు, పోలీసు అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బందికి కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మొహ్మద్ అబ్దుల్ జావిద్ పాషా కృతజ్ఞతలు తెలిపారు. అన్ని కోర్టుల్లో 30 లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.